క్లుప్తంగా

పండిత శ్రీనివాస మూర్తి ఉగాది పురస్కారానికి ఎంపిక



వేమూరు: జంపని చెన్న కేశవస్వామి దేవస్థానంలో వంశ పారంపర్య అర్చకులుగా పని చేస్తున్న మేడూరి శ్రీనివాసమూర్తి ఉగాది పురస్కారంకు ఎంపిక కావడం జరిగిందని ఆలయ కార్యనిర్వహణాధికారి గెత్తం శ్యామ సుందరబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 30వ తేదీన బాపట్లలోని భావనారాయణస్వామి ఆలయ ప్రాంగణంలో బాపట్ల జిల్లా దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ పురస్కారం అందజేయడం జరుగుతుందని ఆయన చెప్పారు. వేమూరు మండలంలోని జంపని గ్రామానికి చెందిన చెన్న కేశవస్వామి దేవస్థానం అర్చకులు శ్రీనివాసమూర్తి ఉగాది పురస్కారంకు ఎంపిక కావడంతో మండలంలోని వివిధ దేవ స్థానాలలో పని చేస్తున్న అర్చకులు అభినందనలు తెలియజేశారు.

చలివేంద్రం ప్రారంభం



నిజాంపట్నం: సినీనటుడు రామ్‌చరణ్ తేజ్ జన్మదిన వేడుకలను మండలంలోని కూచిన పూడి గ్రామంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అభిమానుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఉపాధ్యాయుడు కొలసాని కోటేశ్వరరావు ప్రారంభించి మాట్లాడారు. చలివేంద్రం పాద చారులకు, వాహన చోదకులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. తమ అభిమాన నటుడి పేరుపై సేవా కార్యక్రమాలు చేయటం ఆనందంగా ఉందన్నారు. అనంతరం కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో నల్లపాటి రాజశేఖర్, కొలసాని సంజీవ, గాదె శ్రీనివాస రావు, ఇమ్మడి హరనాథ్, చింతల శ్రీనివాస రావు, చెన్నంశెట్టి చంద్రయ్య, అన్నపరెడ్డి వెంక టేశ్వరరావు, పడమటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మట్టి తవ్వకాలు జరిపితే చర్యలు తప్పవు



నగరం: అక్రమంగా మట్టి తవ్వకాలు జరిపితే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ భార్గవ్ చెప్పారు. మండలంలోని శిరిపూడి గ్రామ శివారులో అక్ర మంగా మట్టిని తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను గురువారం పోలీసులు స్వాధీనం చేసుకు న్నారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు జరిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. శిరిపూడిలో అక్రమ మట్టి తవ్వకాలు జరుగుతున్నాయనే సమాచారంతో దాడులు నిర్వహించి మూడు ట్రాక్టర్లు స్వాధీనం చేసుకుని తహసీల్దార్‌కు అప్పగించినట్లు పేర్కొన్నారు.

అహ్మద్‌ఖాన్ జీవితం యువతకు ఆదర్శం



బాపట్లటౌన్: సయ్యద్ అహ్మద్‌ఖాన్ జీవితాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలని అబ్దుల్ కలాం ఫౌండేషన్ అధ్యక్షుడు పఠాన్ రాజేష్ తెలిపారు. పట్టణంలోని అబ్దుల్ కలాం ఫౌండేషన్ కార్యాలయంలో గురువారం సయ్యద్ అహ్మద్ ఖాన్ వర్ధంతిని నిర్వహించారు. పఠాన్ రాజేష్ మాట్లాడుతూ ఆధ్యాత్మిక విద్యతోపాటు ఆధునిక విద్యతోనే వెనుకబడిన వర్గాల అభ్యున్నతి సాధ్యమని భావించి ఎన్నో అవమానాలు భరించి అలీగఢ్ యూనివర్సిటీని స్థాపించిన విద్యావేత్త, రాజకీయ నాయకుడు, ధార్మికవేత్త అహ్మద్‌ఖాన్ అన్నారు. కార్యక్రమంలో గవిని ప్రసాద్, నర్రా కొండలు, జ్యోతి ప్రసాద్, నక్కా ప్రకాష్, దుర్గా ప్రసాద్, పీరాసాహెబ్, దుర్గ, హరనాథ్ బాబు పాల్గొన్నారు.

హిందూ ధర్మం సనాతనమైంది



చెరుకుపల్లి: హిందూ ధర్మం సనాతనమైనదని, హిందూ ధర్మంలో ఉగాది, శ్రీరామ నవమి పండుగలకు ప్రత్యేకత ఉందని బాపట్ల జిల్లా దేవాలయాల ప్రముఖ్ పొన్నపల్లి సత్యనారాయణ అన్నారు. గూడవల్లిలోని షిర్డీ సాయిబాబా ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించి మహిళలకు పసుపు కుంకుమలు, నూతన వస్త్రాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు, సభ్యులు పడమట వెంకటేశ్వరరావు, కోట వాణిశ్రీ, రావి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

భట్టిప్రోలు కో ఆప్షన్ సభ్యుడిగా నబి ఏకగ్రీవం



కో ఆప్షన్ సభ్యుడిగా ఎన్నికైన సయ్యద్ నబిని అభినందిస్తున్న నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు

కొల్లూరు/భట్టిప్రోలు : స్థానిక సంస్థల్లో ఖాళీగా ఉన్న పదవులను భర్తీ చేయడంలో భాగంగా నిర్వహించిన ఎన్నికల్లో భట్టిప్రోలు మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుని నియామకం వైఎస్సార్‌సీపీ వశం అయ్యింది. గురువారం భట్టిప్రోలు మండల పరిషత్ కార్యాలయంలో ఇటీవల తొలగించిన కో ఆప్షన్ సభ్యుడి స్థానంలో నూతన సభ్యుడ్ని ఎన్నుకునే ప్రక్రియ చేపట్టారు. ఇందులో భాగంగా మండల పరిషత్ పరిపాలక వర్గంలో మొత్తం 14 మంది ఎంపీటీసీ సభ్యులకు గాను 11 మంది వైఎస్సార్‌సీపీకి చెందిన వారు ఉండటంతో కో ఆప్షన్ సభ్యుడిగా సయ్యద్ నబిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తొలుత కూటమి ప్రభుత్వంలో ఉన్న ముగ్గురు సభ్యులతోనే స్థానిక నాయకులు కో ఆప్షన్ సభ్యుని కోసం నామినేషన్ వేసేందుకు ప్రయత్నం చేశారు. అయితే ఈ విషయం వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు దృష్టికి వెళ్లడంతో మండల పరిషత్‌లో బలం లేని కారణంగా పోటీ ప్రయత్నాలను విరమించుకోవాలని సూచించినట్లు టీడీపీ వర్గాలలో చర్చలు జరిగాయి. చివరకు టీడీపీ నుంచి పోటీకి ఎవ్వరూ రాకపోవడంతో, వైఎస్సార్‌సీపీ తరఫున ఎంపీపీ దావులూరి వెంకట లలితకుమారి, మిగిలిన ఎంపీటీసీల సమక్షంలో సయ్యద్ నబి ఒక్కరు మాత్రమే నామినేషన్ పత్రాలు అందజేయడంతో ఏకగ్రీవంగా ఎంపికై నట్లు ప్రత్యేకాధికారి వేణుగోపాలరావు ప్రకటించారు. అనంతరం కో ఆప్షన్ సభ్యునిగా ఏకగ్రీవంగా ఎన్నికైన సయ్యద్ నబికి ప్రత్యేకాధికారి, ఎంపీడీఓ ఎస్‌వీ రమణ అధికారికంగా ఎంపిక పత్రాలను అందజేశారు.

కో ఆప్షన్ సభ్యుడికి వరికూటి అభినందనలు

నూతన కో ఆప్షన్ సభ్యుడిగా ఎన్నికైన సయ్యద్ నబిని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, వేమూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు అభినందించారు. కూటమి ప్రభుత్వం కుయుక్తులకు తలొగ్గకుండా వైఎస్సార్‌సీపీ అభ్యర్థిని ఏకగ్రీవంగా కో ఆప్షన్ సభ్యుడిగా ఎన్నుకున్న మండల పరిషత్ పాలకవర్గంలోని ఎంపీపీ, ఎంపీటీసీ సభ్యులను ఆయన అభినందించారు. భవిష్యత్తులో ప్రజలకు మేలు చేసే విధంగా పరిపాలన కొనసాగించడంతోపాటు, కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలలోకి తీసుకువెళ్లాలని సూచించారు. కో ఆప్షన్ సభ్యుడిగా ఎన్నికైన సయ్యద్ నబి మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి మండల పరిషత్ పాలక వర్గంలో చోటు కల్పించడంలో కీలకంగా వ్యవహరించిన నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు, ఎంపీపీ దావులూరి వెంకట లలితకుమారిలకు కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వహించడంతోపాటు, వైఎస్సార్‌సీపీ అభ్యున్నతికి పాటు పడతానన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పడమట శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.

పెదపులివర్రులో...



పెదపులివర్రు ఉప సర్పంచ్‌గా గొర్రెపాటి శ్రీనివాసరావు

భట్టిప్రోలు మండలం పెదపులివర్రు గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ ఎన్నిక గురువారం నిర్వహించారు. ఉప సర్పంచ్‌గా 2వ వార్డుకు చెందిన గొర్రెపాటి శ్రీనివాస రావు ఎన్నికైనట్లు రిటరినింగ్ అధికారిగా టి.ఊహారాణి (ఈవోపీఆర్డీ) తెలిపారు. గతంలో ఒప్పందం ప్రకారం రెండున్నరేళ్లు కావడంతో కొర్ల మాధవరావు ఉప సర్పంచ్‌గా రాజీనామా చేశారు. కార్యక్రమంలో పంచాయతీ సర్పంచ్ నీలా ఉషారాణి, పంచాయతీ వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి కొక్కిలిగడ్డ వెంకటేశ్వరరావులు పాల్గొన్నారు.



పేటేరులో శ్రీదేవికి నియామక పత్రాన్ని అందజేస్తున్న ఎన్నికల అధికారి ప్రసాద్‌బాబు

ప్రశాంతంగా ఉప సర్పంచ్‌ల ఎన్నిక

రేపల్లె రూరల్: పేటేరు గ్రామ ఉప సర్పంచ్ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. ఎన్నికల అధికారి వీవీడీవీ ప్రసాద్ బాబు మాట్లాడుతూ రాష్ట్ర ఎలక్షన్ కమిషన్ ఆదేశానుసారం పంచాయతీలో గురువారం ఉప సర్పంచ్ ఎన్నిక నిర్వహించటం జరిగిందన్నారు. ఉపసర్పంచ్ పదవికి పోటీలో అభ్యర్థులు ఎవరూ లేకపోవటంతో టీడీపీ బలపరిచిన కనికిచర్ల శ్రీదేవిని ఉప సర్పంచ్‌గా నిమించటం జరిగిందని, నియామక పత్రాన్ని అందజేశారు. శ్రీదేవికి ఎన్నికల అధికారితో పాటు సచివాలయ అధికారులు, సిబ్బంది, వార్డు మెంబర్లు శుభాకాంక్షలు తెలిపారు.

తుమ్మలపాలెం ఉప సర్పంచ్‌గా శ్రీనివాసరావు

చెరుకుపల్లి మండలం తుమ్మలపాలెం ఉప సర్పంచ్ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా ముగిశాయి. ఎన్నికల అధికారి గాయత్రి పర్యవేక్షణలో ఉప సర్పంచ్‌గా చెరుకు శ్రీనివాసరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పోటీలో ఎవరూ లేకపోవటంతో వైఎస్సార్‌సీపీ బలపరిచిన శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారి గాయత్రి నియామక పత్రం అందజేశారు. ఉప సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన శ్రీనివాసరావుకు వైఎస్సార్‌సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ శుభాకాంక్షలు తెలిపారు.

పీవీపాలెం ఎంపీపీ పదవి కైవసం చేసుకున్న వైఎస్సార్‌సీపీ



పీవీపాలెం ఎంపీపీగా ప్రమాణస్వీకారం చేస్తున్న సీతారామరాజు

పిట్టలవానిపాలెం(కర్లపాలెం): అధికార పార్టీ ప్రలోభాలకు లొంగకుండా ఎంపీటీసీ సభ్యులందరూ ఐకమత్యంగా నిలబడటంతో పిట్టలవానిపాలెం ఎంపీపీ పదవిని వైఎస్సార్‌సీపీ కైవసం చేసుకుంది. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం జరిగిన ఎంపీపీ ఎన్నికలో పిట్టువారిపాలెం ఎంపీటీసీ సభ్యుడు వైఎస్సార్‌సీపీ అభ్యర్థి దెందుకూరి సీతారామరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

పిట్టలవానిపాలెం ఎంపీపీ పదవి ఓసీ జనరల్ కావటంతో మొదటి రెండున్నర సంవత్సరాలు చందోలు-1 ఎంపీటీసీ సభ్యుడు షేక్ బాజీ ఎంపీపీగా తరువాత రెండున్నర సంవత్సరాలు దెందుకూరి సీతారామరాజు ఉండాలనే ఒప్పందంతో బాజీ రెండున్నర సంవత్సరాలు ఎంపీపీగా బాధ్యతలు నిర్వహించి అనంతరం రాజీనామా చేయటంతో ఎంపీపీ పదవికి ఎన్నిక జరిగింది.

- పిట్టలవానిపాలెం ఎంపీపీ ఎన్నిక ఎన్నికల అధికారి, డీఎల్‌డీవో చెరుకూరి విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఎన్నికల పరిశీలనాధికారి జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్ పర్యవేక్షణలో పోలీసుల బందోబస్తు మధ్య గురువారం ఉదయం 11 గంటలకు జరిగింది. 10.45 గంటలకు వైఎస్సార్‌సీపీకి చెందిన పది మంది ఎంపీటీసీ సభ్యులందరూ పార్టీ కండువాలు ధరించి మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో తమకు కేటాయించిన సీట్లలో కూర్చున్నారు. కొద్దిసేపటికి సంగుపాలెం ఎంపీటీసీ గంగయ్య హాజరయ్యారు. ఎన్నికల అధికారి విజయలక్ష్మి మాట్లాడుతూ ఎంపీపీ ఎన్నికలో పోటీ చేసే వారి పేర్లను తెలపాలని కోరగా చందోలు-1 ఎంపీటీసీ సభ్యుడు షేక్ బాజీ పిట్టువారిపాలెం ఎంపీటీసీ సభ్యుడు దెందుకూరి సీతారామరాజు పేరును ప్రతిపాదిస్తున్నట్లు తెలపగా పిట్టలవానిపాలెం ఎంపీటీసీ సభ్యుడు చేబ్రోలు కృపానందం ఎంపీపీగా సీతారామరాజు పేరును బలపరిచారు. ఎన్నిక నిర్ణీత సమయానికి ఎంపీపీ పదవికి దెందుకూరి సీతారామరాజు ఒక్కరే పోటీలో ఉండటంతో ఆయన ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి చెరుకూరి విజయలక్ష్మి ప్రకటించి ధ్రువీకరణ పత్రం అందజేసి ఎంపీపీగా ప్రమాణస్వీకారం చేయించి చైర్‌లో కూర్చోబెట్టారు. ఎంపీపీ దెందుకూరి సీతారామరాజుకు ఎన్నికల అధికారి విజయలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు. బాపట్ల సీఐ హరికృష్ణ, కర్లపాలెం ఎస్‌ఐ రవీంద్ర, చందోలు ఏఎస్‌ఐ డేవిడ్ తమ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. ఎంపీపీ ఎన్నికలో ఎంపీటీసీలు కృష్ణకుమారి, సింధు, బాజీ, సీతారామరాజు, కరీమున్నీసా, విజయరాజు, కుమారి, కాంతకుమారి, రాహేలు, కృపానందం, గంగయ్య పాల్గొన్నారు.

216 బైపాస్‌ను కుందేరు వాగు వెంబడి నిర్మించాలి

ఆందోళన చేసిన రైతులు



ఆందోళన చేస్తున్న రైతులు

బాపట్లటౌన్: 216 జాతీయ రహదారి డైవర్షన్ రోడ్డును గ్రామాల గుండా కాకుండా కుందేరు వాగు వెంబడి నిర్మించాలని డిమాండ్ చేస్తూ గురువారం ఆయా గ్రామాల్లోని రైతులు జాతీయ రహదారిపై ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులు మాట్లాడుతూ బాపట్ల ఇంజనీర్ కళాశాల వద్ద ఉన్న బైపాస్ రోడ్డును కుందేరు వాగు వైపు నుంచి ఈపూరుపాలెం వరకు ఉన్న బైపాస్ రోడ్‌లో కలపాలన్నారు. 216 జాతీయ రహదారి వెదుళ్ళపల్లి గ్రామం మధ్య నుంచి వెళుతున్న నేపథ్యంలో 3 ఏళ్ల క్రితమే ఈ రహదారిని విస్తరించారన్నారు. ఊరి మధ్యలో కాకుండా పక్కనే ఉన్న కుందేరు వాగు వైపుకు డైరెక్షన్ చేయాలని కోరుతూ గతంలోనే కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రికి వినతి పత్రం అందజేశామన్నారు. ఎన్‌హెచ్ 216ను మరింత విస్తరించాలని వచ్చిన వార్తల నేపథ్యంలో వెదుళ్ళపల్లి పరిసర గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారన్నారు. ఊరి మధ్యలో నుంచి వెళితే చిన్న, సన్నకారు రైతులకు తీవ్ర నష్టం కలుగుతుందన్నారు. ఆందోళన చేసిన వారిలో పులిపాక హరిప్రసాద్, కోట వెంకటేశ్వర రెడ్డి, రాగాల చిన కోటేశ్వరరావు, అన్నం భాస్కర్, సాతులూరి నాగేశ్వరరావు, డాక్టర్ స్వరల హనుమంతరావు, డాక్టర్ ఆంజనేయాచారి, డి.వి. రమణయ్య పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల పదోన్నతులకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వాలి

ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దామోదరరావు



మాట్లాడుతున్న ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పలిశెట్టి దామోదరరావు

బాపట్లటౌన్: పెండింగ్‌లో ఉన్న ఆర్టీసీ ఉద్యోగుల పదోన్నతులకు వెంటనే గ్రీన్ సిగ్నల్ ఇవ్వాలని ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు తెలిపారు. పట్టణంలోని ఎన్‌జీవో హోంలో గురువారం ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. దామోదరరావు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు ఐఆర్ ప్రకటించాలని, బకాయిలు చెల్లించాలన్నారు. 12వ పీఆర్‌సీ కమిషన్‌ను వెంటనే నియమించాలన్నారు. ఆర్టీసీ ఉద్యోగులకు 11వ పీఆర్సీకి సంబంధించిన 24 నెలల బకాయిలు, డీఏ బకాయిలు, సరండర్ లీవ్ డబ్బులు చెల్లించాలన్నారు. పదోన్నతుల విషయంలో వెంటనే స్పందించకపోతే ఏప్రిల్ మొదటి వారంలో ఉద్యమం బాట పట్టాల్సి వస్తుందన్నారు. ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కార్యదర్శి వై. శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లాలో కొంతమంది అధికారులు, చీరాల డిపోమేనేజర్ అవలంబిస్తున్న విధానాలపై జిల్లా డీపీవోకు మెమోరాండం ఇవ్వాలని నిర్ణయించడమైందన్నారు. సమావేశంలో ఎంప్లాయీస్ యూనియన్ ఆర్గనైజింగ్ సెక్రటరి బి.టి.వలి, నెల్లూరు జోన్ జోనల్ అధ్యక్షులు వాకా రమేష్, ఏపీజేఏసీ బాపట్ల జిల్లా చైర్మన్ సురేష్ పాల్గొన్నారు.

ఈద్గాలను శుభ్రం చేయించాలి



భట్టిప్రోలు: ఈద్-ఉల్-ఫితర్ (రంజాన్) పురస్కరించుకుని భట్టిప్రోలు, అద్దేపల్లి, పల్లెకోన, వేమవరం గ్రామాలలో ఈద్గాలను శుభ్రం చేయించాలని ముస్లిం సోదరులు గురువారం కోరారు. రంజాన్ మాసం, ఉపవాస దీక్షలు మార్చి నెల ఒకటి నుంచి ప్రారంభమయ్యాయని, 31న ఈద్గాలలో ముస్లిం సోదరులు నమాజును జరుపుకొంటారన్నారు. ఈద్గాల చుట్టూ పిచ్చి చెట్లు, ముళ్ల కంపలతో నిండిపోయి ఉన్నాయని వాటిని శుభ్రం చేయించాలని గ్రామ పంచాయతీ కార్యదర్శి, తహసీల్దార్, ఎంపీడీవోలను వారు కోరారు.

పీఎం అజయ్ లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ



ఎస్సీ కార్పొరేషన్ రుణాల చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు

వేమూరు: గ్రామీణ ప్రాంతంలోని పేదరికంగా వెనుకబడిన కుటుంబాలకు ప్రధానమంత్రి అనుసూచిత్ జాతి అభ్యుదయ యోజన ద్వారా రుణాలు ఇవ్వడం జరిగిందని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు తెలిపారు. మండల కేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో గురువారం లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ కార్పొరేషన్ ద్వారా నియోజకవర్గంలోని 13 మంది లబ్ధిదారులకు రూ.23 లక్షలు చెక్కులు అందజేయడం జరిగిందన్నారు. వేమూరు మండలంలో ముగ్గురు, భట్టిప్రోలు మండలంలో ఇద్దరు, కొల్లూరు మండలంలో ఇద్దరు, చుండూరు మండలంలో ముగ్గురు, అమర్తలూరు మండలంలో ముగ్గురు లబ్ధిదారులకు రుణాలు ఇవ్వడం జరిగిందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో వెలుగు పథకం ప్రాజెక్ట్ అధికారులు శోభనబాబు, రాము, రాంబాబు, శ్రీమన్నారాయణ, సీసీలు పాల్గొన్నారు.

బాలబాలికలకు మెమొరబుల్ సర్టిఫికెట్లు అందజేత



భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలం సూరేపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని వేమవరం మండలం పరిషత్ ప్రాథమిక పాఠశాల (ఎల్ఈ) బాలబాలికలకు తమ ఫొటోలతో సర్టిఫికెట్లను గురువారం ఎంఈవో నీలం దేవరాజ్ చేతుల మీదగా అందజేశారు. భట్టిప్రోలుకు చెందిన విశ్రాంత బ్యాంక్ ఉద్యోగి కాళంగి వీర వెంకట పాండురంగారావు విద్యార్థులను ప్రోత్సహించే దిశగా స్వీట్ మెమరిబల్, హ్యాపీ బర్త్ డే, డేట్ విత్ కరెన్సీ నోట్‌తో పిల్లల ఫొటోలతో వచ్చే విధంగా సర్టిఫికెట్లను తయారు చేయించి అందించారు. ఈ సర్టిఫికెట్లను ప్రత్యేకత ఏమిటంటే పిల్లల పుట్టిన రోజు తేదీ కరెన్సీ నోటుపై విధంగా రూపొందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పి.కిషోర్, సీఆర్పీ కె.కృష్ణారావు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పేదవారికి సాయం చేసే గుణాన్ని అలవరుచుకోవాలి



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న డాక్టర్ గణేష్, మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షురాలు నసీరున్నీసా

వైఎస్సార్‌సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గణేష్

రేపల్లె రూరల్: పేదవారికి సాయం చేసే గుణాన్ని ప్రతి ఒక్కరూ అలవరుచుకోవాలని వైఎస్సార్‌సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ అన్నారు. రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని వైఎస్సార్‌సీపీ బాపట్ల జిల్లా మైనారీ సెల్ అధ్యక్షురాలు షేక్ నసీరున్నీసా బేగం-డాక్టర్ అతిక్ దంపతుల సహకారంతో వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి కర్రీ వెంకట కృష్ణారెడ్డి క్యాంప్ కార్యాలయంలో పేద మహిళలకు గురువారం నిర్వహించిన చీరల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. డాక్టర్ అతిక్- నసీరున్నీసా బేగంలు ప్రతి ఏటా పేద ముస్లిం మహిళలకు నూతన వస్త్రాలు అందిస్తూ పలువురికి మార్గదర్శకంగా నిలుస్తున్నారన్నారు. ఈ సందర్భంగా 100 మంది మహిళలకు చీరలు పంపిణీ చేసి, ఓల్డ్‌టౌన్‌లోని మదరస్సా (ముస్లిం అనాథ చిన్నారుల ఆశ్రమము)కు నూతన కూలర్‌ను అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రేపల్లె పట్టణ, మండల, చెరుకుపల్లి మండలాల అధ్యక్షులు కరేటి శేషగిరిరావు, మేడికొండ అనిల్, దుండి వెంకట రామిరెడ్డి, నాయకులు చిత్రాల ఓబేదు, చిమటా బాలాజీ, నీలా నాంచారయ్య, లియాకత్ బాషా, అబ్దుల్ ఖుద్దూష్, పట్టెం శ్రీనివాసరావు, కొలుసు బాలకృష్ణ, వీసం నాగలక్ష్మి, సజ్జా పద్మావతి, ఆలా రాజ్ పాల్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు, పారిశుద్ధ్య కార్మికులు

రేపల్లె రూరల్: పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ నాయకులు పి.నాగాంజనేయులు, గొట్టుముక్కల బాలాజీ డిమాండ్ చేశారు. పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టింది. కార్మికులపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. మహిళా కార్మికులను వేధింపులకు గురి చేస్తున్న అధికారులపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పట్టణానికి సరిపడా అదనపు కార్మికులను నియమించాలని కోరారు. శాశ్వత పారిశుద్ధ్య కార్మికులకు ఎరియర్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం కమిషనర్ సాంబశివ రావుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు శ్రీనివాసరావు, శివశంకర్, దుర్గా వేణు, పోతురాజు, రాజేశ్వరి, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన తప్పనిసరి

సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు



రేపల్లె రూరల్: చట్టాలపై అవగాహన తప్పనిసరిగా ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ టీ వెంకటేశ్వర్లు అన్నారు. పట్టణంలోని సబ్ జైలులో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం రిమాండ్ ఖైదీలకు చట్టాలపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. రిమాండ్ ఖైదీలు తమ కేసులను వాదించేందుకు ప్రైవేటు న్యాయవాదులను ఆశ్రయించే స్థోమత లేనివారికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన న్యాయవాది ద్వారా న్యాయ సేవలు పొందవచ్చని పేర్కొన్నారు. క్షణికావేశంలో చేసిన తప్పిదాలతో బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోరాదని, ఇక నుంచైనా సత్ప్రవర్తనతో జీవించాలని సూచించారు. సబ్ జైలులో ఖైదీలకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో సబ్ జైల్ సూపరింటెండెంట్ ఎం.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

పశు వైద్య సహాయ సంచాలకులు రమణమ్మ



లేగదూడల ప్రదర్శనలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న డాక్టర్ రమణమ్మ

నగరం: పశువులకు వ్యాపించే సీజనల్ వ్యాధులపై పశు పోషకులు అప్రమత్తంగా వ్యవహరించాలని పశు వైద్య సహాయ సంచాలకులు డాక్టర్ ఏ రమణమ్మ చెప్పారు. మండలంలోని పూడివాడ గ్రామంలో గురువారం లేగదూడల ప్రదర్శన కార్యక్రమాన్ని రమణమ్మ ప్రారంభించి మాట్లాడారు. పశు పోషకులు శాస్త్రీయ పద్ధతులను అవలబించడం ద్వారా పాడి పరిశ్రమను అభివృద్ధి చేయవచ్చన్నారు. పశుపోషకులు బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గాలికుంటు వ్యాధులు రాకుండా ముందుగానే టీకాలు వేయించుకోవాలన్నారు. లేగ దూడల ప్రదర్శనకు 85 దూడలు వచ్చినట్లు తెలిపారు. వీటిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచిన లేగ దూడల యజమానులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ చలపతిరావు, కరీముల్లా, హేమప్రియ, జయగోపాల్, వెంకటేశ్వరావు, సారథి పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వానికి రైతుల సంక్షేమం కానరాదా..?

- వైఎస్సార్‌సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గణేష్
- నేడు మిర్చికి కనీస మద్దతు ధర కల్పించాలని చెరుకుపల్లిలో ధర్నా



రైతు విభాగం నాయకులతో మాట్లాడుతున్న నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గణేష్

రేపల్లె రూరల్: రైతుల సంక్షేమం కూటమి ప్రభుత్వానికి పట్టదా అని వైఎస్సార్‌సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ ప్రశ్నించారు. చెరుకుపల్లి మండలం గుళ్ళపల్లిలోని తన క్యాంప్ కార్యాలయంలో రైతు విభాగం నాయకులతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్పొరేట్ శక్తులను పెంచి పోషించే వారికి రైతు సమస్యలు కానరాకపోవటం రైతుల దురదృష్టకరమన్నారు. రైతులను కూటమి ప్రభుత్వం దగా చేస్తోందన్నారు. కల్లబొల్లి మాటలు చెప్పటం, ప్రజలను వంచించటం సీఎం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్యేనన్నారు. రైతులకు ఏటా రూ.20 వేల పెట్టుబడి సాయం అందిస్తామని చెప్పి నేడు ఆ ఊసే ఎత్తకపోవటం రైతులను వంచించటం కాదా అని ప్రశ్నించారు. రైతుల సంక్షేమం కేవలం వైఎస్సార్‌సీపీ పేటెంట్ హక్కు అని గుర్తు చేశారు. సకాలంలో రైతులకు రైతు భరోసా పేరుతో పెట్టుబడి సాయం అందించిన ఘనత జగన్‌మోహన్ రెడ్డికి మాత్రమే దక్కుతుందన్నారు. మిర్చికి కనీస మద్దతు ధర కల్పించాలని కోరుతూ 28వ తేదీ శుక్రవారం రైతులతో కలిసి ర్యాలీ, ధర్నా నిర్వహించటం జరుగుతుందని పేర్కొన్నారు. తుమ్మలపాలెంలో ప్రారంభమయ్యే ర్యాలీ చెరుకుపల్లిలోని తహసీల్దార్ కార్యాలయం వద్దకు చేరుకుని, వినతి పత్రం అందించబడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో రైతులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రేపల్లె నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షుడు కొండేపి శ్రీనివాసరావు, చెరుకుపల్లి రైతు విభాగం అధ్యక్షుడు ఆరాధ్యుల వాసుదేవరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మైనర్ బాలిక అదృశ్యం

కర్లపాలెం: ఓ మైనర్ బాలిక అదృశ్యమైన ఘటన మండల పరిధిలోని పేరలి గ్రామంలో చోటు చేసుకుంది. కర్లపాలెం ఎస్‌ఐ రవీంద్ర తెలిపిన వివరాల మేరకు పేరలి గ్రామానికి చెందిన పఠాన్ బాజీ కుమార్తె బుధవారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. తల్లిదండ్రులు బంధువులు, తెలిసిన వారి ఇళ్ల వద్ద వెదకినా ఆచూకీ తెలియకపోవటంతో బాలిక తండ్రి బాజీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ రవీంద్ర వివరించారు.